## కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసిన టీఎన్‌జీవో నేతలు

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 3 ప్రభాతవార్త:** ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని శుక్రవారం సమీకృత కార్యాలయ సముదాయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను టీఎన్జీవోల జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి నోటు పుస్తకాలు, పెన్నులు అందజేసి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగులకు, వారి కుటుంబాలకు కలెక్టర్ రాహుల్ రాజ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు ప్రభుత్వ యంత్రాంగానికి తోడ్పాటును ఇస్తూ రాష్ట్రంలో మెదక్ జిల్లా అగ్రస్థానంలో ఉండే విధంగా కృషి చేయాలన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా కార్యదర్శి మినికి రాజ్ కుమార్, సహ అధ్యక్షులు ఎండి. ఇక్బాల్ పాషా, కోశాధికారి మాణిక్యాల చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు యండి. ఫజులుద్దీన్, కోటి రఘునాథరావు, నర్సాపూర్ యూనిట్ అధ్యక్షులు కే. శేషాచారి, వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి శేఖర్ తదితరులు ఉన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

# వార్త

## రోడ్డు సమస్యను పరిష్కరించండి

**-మంత్రి కోమటిరెడ్డికి ఈశ్వర్ గారి రమణ వినతి**

**రామచంద్రాపురం, జనవరి 3, ప్రభాతవార్త:** తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓఆర్ఆర్ 30ఎగ్జిట్ నెంబర్ రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతూ తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌గారి రమణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌గారి రమణ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా రోడ్డు అసంపూర్తిగా ఉండటంతో ప్రజలు అనేక పాట్లు పడుతున్నారని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఈశ్వర్ గారి రమణ వివరించారు.



మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఈశ్వర్‌గారి రమణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

## ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన పెంచాలి

**గౌరవెల్లి, గండిపల్లి కాల్వలు పూర్తిచేసి సాగునీరు అందిస్తాం**

**స్థానిక సంస్థల ఎన్నికల్లో ఊరూరా కాంగ్రెస్ జెండా ఎగరాలి**

**మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్**

**అక్కన్నపేట, జనవరి 3 ప్రభాతవార్త:** ప్రభుత్వ పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. అక్కన్నపేటలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని నాయకులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, రిజర్వేషన్లు ఏం వచ్చిన అందరూ ఐక్యంగా పని చేయాలన్నారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ లను దశలవారీగా అమలు చేయడం జరుగుతుంద న్నారు. ఏడాదిలో కాంగ్రెస్ పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. గౌరవెల్లి, గండిపల్లి కాలువలు పూర్తిచేసి వ్యవసాయానికి సాగునీరు అందిస్తామన్నారు. ప్రభుత్వం, విద్య, వైద్యం, సాగునీటికి అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేస్తూ పార్టీని మరింత బలో పేతం చేయాలని చెప్పారు. సమావేశంలో గ్రంథా లయ చైర్మన్ కెడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ శివయ్య, మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నూతన సంవత్సరంలో ప్రజల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలి : జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న వివిధ శాఖల అధికారులు

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 3 ప్రభాతవార్త:** నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలందరికి సుఖసంతోషాలు వెల్లివిరియాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకాంక్షించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్, అడిషనల్ ఎస్పీ మహేందర్, డీఆర్‌వో భుజంగరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డిఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, డీపీవో యాదయ్య, ఆర్డీవోలు నర్సాపూర్ మహిపాల్‌రెడ్డి, తూప్రాన్ జయచంద్రారెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్, జిల్లా అధికారులు, టీజీవోలు, టీఎన్జీవోల నాయకులు కలెక్టరేట్ రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు లక్ష్యాలను నిర్దేశించుకుని అభివృద్ధిని వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలతో మమేకమవుతూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన వివిధశాఖల అధికారులు



కలెక్టర్‌కు నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి వివిధశాఖలకు చెందిన అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సీపీ డాక్టర్ అనురాధ, జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్వో నాగరాజమ్మ, సిద్దిపేట ఆర్డీఓ, వివిధశాఖల అధికారులతో పాటు ఉద్యోగ సంఘాల నాయకులు కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

**క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్**

తెలంగాణ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ యూనిట్ క్యాలెండర్‌ను కలెక్టర్ అవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కోమాండ్ల విక్రమ్‌రెడ్డి, ప్రతినిధులు సురేందర్‌రెడ్డి, అశ్వక్ అహ్మద్, సుకుమారి, జబీనా సుల్తానా, అరుణ, అనురాధ, జమున, రాణి, శ్వేత, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్ ఫాయిజన్ వల్లే శ్వేత మృతి

**భర్త నల్ల నాగుల వెంకటచారి**

**చేర్యాల, జనవరి 3, ప్రభాతవార్త :**

చేర్యాల వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ నల్ల నాగుల శ్వేత కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు శుక్రవారం సోషల్ మీడియాలో వస్తున్న వార్తపై భర్త వెంకటచారి స్పందించారు. కొంత మంది పనికట్టుకుని తన భార్య కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యకు పాల్పడిందని దుష్ప్రచారం చేస్తున్నారని, ఇది సరైంది కాదని ఒక వీడియో సోషల్ మీడియా ద్వారా తెలిపారు. గురువారం రాత్రి ఫుట్ ఫాయిజన్‌తో అస్వస్థకు గురైందని, దీంతో శుక్రవారం ఉదయం మరింత ఎక్కువ కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లామే తప్పా ఎలాంటి అఘాయిత్యానికి పాల్పడలేదని తెలిపారు. సోషల్ మీడియాలో అనవసర పోస్టులు పెట్టి రాజకీయం చేస్తున్నారని తెలిపారు.

## సావిత్రిబాయి పూలె జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

**మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్**

**హుస్నాబాద్ రూరల్, జనవరి 3, ప్రభాతవార్త :** సావిత్రిభాయ్ పూలే జయంతిని సర్కారు మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించిందని రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని పోతారం(ఎస్) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలె 194వ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ సమర్థవంతురాలైతే ఆ కుటుంబం అన్ని విధాలుగా ఎదుగుతుందన్నారు. మహిళలు చదువుకొని అన్ని రంగాలలో రాణించాలని విద్యాబోధన అందించడం కోసం ఆమె పోరాటం చేశారని గుర్తు చేశారు. మహిళలు చదువుకోవద్దని అనే కాలం నుంచి కష్టపడి చదువుకొని 52 పాఠశాలలు ఏర్పాటు చేసిందన్నారు. జనాభాలో మేం సగం అనే స్థాయికి ఎదిగేలాచేసిన తల్లి సావిత్రిబాయి పూలె అన్నారు. సావిత్రిబాయి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా మౌలిక సదుపాయాలు, నూతన ఉపాధ్యాయ నియామకాలు, పదోన్నతులు, బదిలీలు, పుస్తకాలు, యూనిఫాం అన్ని రకాల వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. సావిత్రి బాయి పూలె జయంతి సందర్భంగా ప్రభుత్వ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడంతో మహిళా ఉపాధ్యాయులను మంత్రిని సత్కరించారు. బొమ్మగాని రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మంత్రి విద్యార్థులకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. సిఎం కప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంత్రి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కెడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, ఎఎంసి చైర్మన్ తిరుపతి రెడ్డి, ఆర్డీఓ, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు క్రీడ దుస్తులు పంపణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

## సావిత్రిబాయి పూలెను స్మరించుకోవడం అందరి బాధ్యత

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** సావిత్రిబాయి పూలెను స్మరించుకోవడం అందరి బాధ్యత అని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సావిత్రిబాయి పూలె జయంత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయుని, రచయిత్రి, కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణి అధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన మహిళ అన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కల్టెకర్ అబ్దుల్ హమీద్, డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సావిత్రి భాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

**సావిత్రిబాయి కృషితోనే చదువుకునే అవకాశం**

**సిద్దిపేట అర్బన్, జనవరి 3, ప్రభాతవార్త :** సావిత్రిబాయి కృషివల్లే ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ బడుగు బలహీన వర్గాల ప్రజలకు చదువుకునే అవకాశం లభించిందని సిద్దిపేట అర్బన్ మండల ఎన్సాన్‌పల్లి మాజీసర్పంచ్ రవీందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో చదువుల తల్లి సావితిబాయి జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా అమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



సంగమ్మను పరీక్షిస్తున్న వైద్యులు

### ‘వార్తకు స్పందన’

## సంగమ్మను ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు

**టేక్మాల్, జనవరి 3, ప్రభాతవార్త:** ‘ఎలకుర్తి పల్లె దవఖానలో వికటించిన వైద్యం..ఆస్పత్రిలో చేరిన వృద్ధురాలు’ శీర్షికతో 3వ తేదీన ‘వార్త’దినపత్రికలో ప్రచురించిన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. జిల్లా వైద్యాధికారి మందలింపుతో వైద్యం వికటించి అస్వస్థతకు గురైన టేక్మాల్ మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన పటోళ్లనసంగమ్మ(70) ఇంటికి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి హర్షిత, పల్లె దవాఖాన వైద్యాధికారి ఉదయభాను వెళ్లి పరామర్శించి టేక్మాల్ ఆసు పత్రికి తరలించారు. సంగమ్మకు టేక్మాల్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందేలా చూస్తామని కుంటుంబ సభ్యులకు వైద్యాధికారి హర్షిత ధైర్యాన్నిచ్చారు. ఈ విషయమై డాక్టర్ హర్షితను విలేకరులు వివరణ కోరగా అందుకు నిరాకరిస్తూ జిల్లా వైద్యాధి కారుల ఆదేశాల మేరకు నడుచుకుంటామని, వారిని అడిగి వివరణ ఇస్తా మంటూ వెళ్లిపోయారు. మాజీ సర్పంచ్ శ్వేత శేఖర్‌రెడ్డి, నాయకులు మాణెయ్య. దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

## ఘనంగా సావిత్రి బాయి పూలె జయంతి వేడుకలు

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 3 ప్రభాతవార్త:** సావిత్రి బాయి పూలే జయంతి, జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యా, సామాజిక సంస్కర్త, ఆధునిక భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలె జయంతి వేడుకలను నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, ఇతర జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం కృషి చేయాలని, అప్పుడే ఆమె ఆశయ సాధనకు కృషి చేసినట్లు అవుతుందని అన్నారు. సావిత్రి బాయి సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఇకనుండి ఆమె జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా జనవరి 3వ తేదీన మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించిందని తెలిపారు. అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలోనూ తన భర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో సావిత్రి బాయి చదువు నేర్చుకుని ఉపాధ్యాయురాలు అయ్యారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, ముఖ్య ప్రణాళిక అధికారి బద్రీనాథ్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, యువజన క్రీడల నిర్వహణ అధికారి నాగరాజు, సంబంధిత ఇతర జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బైపాస్ రోడ్డుపై రైతుల అనుమానాలను నివృత్తి చేయాలి

**భూ నిర్వాసితులు సర్వేకు సహకరించాలి**

**మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్ రావు**

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 3 ప్రభాతవార్త:** రామాయణపేట బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూ నిర్వాసితులకు వాస్తవాలను వివరించాలని, క్షేత్రస్థాయి సర్వే ద్వారా నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు అధికారులకు సూచించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్‌హెచ్ -76డీజీ మెదక్ టూ సిద్దిపేట 69 కిలో మీటర్ల బైపాస్ రోడ్డు రామాయంపేట బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులతో మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు, మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, నేషనల్ హైవే ఈఈ బలరామకృష్ణలు రామాయంపేట భూ నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితుల మనోభావాలను విడతల వారీగా స్వయంగా వారి మాటల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాధవనేని రఘునందన్ రావు మాట్లాడుతూ ఎన్‌హెచ్-76డీజీ మెదక్ టూ సిద్దిపేట 69 కిలోమీటర్లు బైపాస్ నిర్మాణంలో ఉండగా భూ సర్వేకి సంబంధించి రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో 2.65 కిలోమీటర్ల బైపాస్ రోడ్డు నిర్మాణంలో నిర్వాసితులు రోడ్డు విస్తరణలో భూ సర్వేకు సహకరించాలన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూనిర్వాసితుల విజ్ఞప్తి మేరకు ఆర్డీవో తాసిల్దార్ స్థాయిలో క్షేత్రస్థాయి సర్వే ద్వారా నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. బైపాస్ రోడ్డు విషయంలో నిర్వాసితుల సమస్యలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ నిర్వాసితులకు పరిహార విషయంలో భూ సర్వేలో నిబంధన మేరకు రిజిస్ట్రేషన్ ధరలకు అనుగుణంగా పరిహారం అందేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు మాట్లాడుతూ రామాయంపేట బైపాస్ రోడ్డు విషయంలో నిర్వాసితుల సమస్యలను తెలుసుకుంటామని, మీకున్న కష్టాలను తీర్చే విధంగా నియోజకవర్గ అభివృద్ధిలో మీ వెంటే ఉండే పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, నేషనల్ హైవే ఈఈ బలరామకృష్ణ, డీఈ అన్నయ్య, ఏఈ మురళీకృష్ణ, రామాయంపేట తహశీల్దార్ రజని, సంబంధిత భూ నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యే రోహిత్ రావు, కలెక్టర్ రాహుల్ రాజ్



సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

## అడబిడ్డలకు అక్షరాన్ని నేర్పిన మహనీయురాలు సావిత్రిబాయి పూలె

**సిద్దిపేట అర్బన్/చిన్నకోడూరు/కోహెడ, జనవరి 3, ప్రభాతవార్త:** మహిళల అభ్యున్నతి కోసం పోరాటం చేసిన సామాజిక విప్లవకారిణి అడబిడ్డలకు అక్షరాన్ని పరిచయం చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో సావిత్రి బాయి పూలె జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత దేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రి బాయి పూలె అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి సావిత్రి బాయి జన్మదినాన్ని మహిళ ఉపాధ్యాయులు దినంగా ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకలు మహేందర్‌రావు, యాదగిరి, లక్ష్మి, పూజల గోపికృష్ణ, పద్మ, అజ్మత్, వాహబ్, జనార్ధన్‌రెడ్డి, వనజ, శ్రీనివాస్, సందీప్, అక్బర్, అజమాత్, సంతోష, రజని తదితరులు పాల్గొన్నారు.

**కోహెడలో...**

మండల పరిధిలోని నాగసముద్రాల తెలంగాణ ఆదర్శ పాఠశాలలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి రవీందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**చిన్నకోడూరులో...**

సావిత్రి బాయి పూలే జీవిత చరిత్ర భారత దేశానికే ఆదర్శమని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చిన్నకోడూరులో సావిత్రి బాయి పూలె జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడతూ మహిళ హక్కుల కోసం కుల వివక్ష విముక్తి కోసం సావిత్రిబాయి పూలే అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కాముని శ్రీనివాస్, కీసర పాపయ్య, మేడికాయల వెంకటేశం, ఇట్టబోయిన శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, లింగం, తిరుపతిరెడ్డి, వాసు, రాజు, అంజయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

**జూనియర్ కళాశాలలో...**

చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్‌కళాశాలలోనప్రిన్సిపల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలె జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళ అధ్యాపకులు సునీత, మౌనిక, సౌమ్యలను ప్రిన్సిపల్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**రామంచ ప్రాథమిక పాఠశాలలో...**

మండల పరిధిలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం అబ్దుల్లా షరీఫ్, ఉపాధ్యాయులు లలిత, సునీత, నాగమణి, వై.వి.సురేష్‌కుమార్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కారించారు



చిన్నకోడూరులో సావిత్రిబాయికు నివాళులర్పిస్తున్న దృశ్యం

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**కొమురవెల్లి, జనవరి 3, ప్రభాతవార్త :** మండలపరిధిలోని మర్రిముచ్యాల గ్రామంలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. మర్రిముచ్యాలకు చెందిన బాలనర్సయ్య ఆటో నడపుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు. కుటుంబ పోషణకు డబ్బులు సరిపోకపోవడంతో భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో బాలనర్సయ్య జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు వివరించారు.

**పురుగుల మందు తాగి మహిళ...**

మండల పరిధిలోని గురువన్నపేట గ్రామానికి చెందిన ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు. ఎస్ఐ రాజు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గంగమణికి ఇద్దరు కుమారులు వివాన్, వంశీ ఉన్నారు. చిన్న కుమారుడు వివాన్ అల్లరి చేస్తుండగా తల్లి గంగమణి మందలించడంతో పెద్ద కుమారుడు వంశీ తమ్ముని ఎందుకు కొడుతున్నావని గొడవ పెట్టుకోవడంతో గంగమణి క్షణికావేశంలో ఇంట్లో వరి పొలం కోసం దాచిన పురుగుల మందును గత నెల 24న తాగినట్లు తెలిపారు. వెంటనే గంగమణిని చికిత్సనిమిత్తం గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం ఆర్‌విఎంకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు వివరించారు.

## 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**చేర్యాల, జనవరి 3,ప్రభాతవార్త :** ప్రభుత్వ రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తున్న ఇద్దరు రేషన్ డీలర్లపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఇద్దరు రేషన్ డీలర్లు పడకంటి ఉమాపతి, దేవయ్యలు ఇద్దరు అక్రమంగా 5క్వింటళ్ల రేషన్ బియ్యాన్ని ఓ ఇంట్లో నిల్వ ఉంచారని సిద్దిపేట టాస్క్ ఫోర్స్, చేర్యాల పోలీసులకు నమ్మదగిన సమాచారం అందడంతో దాడులు నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైన చట్ట వ్యతిరేఖ కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



రేషన్ బియ్యాన్ని చూపిస్తున్న పోలీసులు

## కిజర్ యాఫై గోల్డ్ కప్ క్రికెట్ టోర్నీ




విలేకరులతో మాట్లాడుతున్న కిజర్ యాఫై

**జహీరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:**
ఈనెల 5వ తారీఖు నుంచి 14వ తేదీ వరకు పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో కిజర్ యాఫై గోల్డ్‌కప్ క్రికెట్ టౌర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు సామాజికవేత్త, రైతునేస్తం కిజర్ యాఫై, క్రికెట్ టౌర్నమెంట్ ఆహ్వాన కమిటి చైర్మన్ రాములు నేతలు అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిజర్ యాఫై, రాములు నేతలు మాట్లాడుతూ టౌర్నమెంట్‌లో తెలంగాణ రాష్ట్రంతో పాటు భారత దేశంలోని పలు రాష్ట్రాల క్రీడాజట్టు పాల్గొంటున్నాయన్నారు. టోర్నీ విజేత జట్టుకు 6లక్షల 11వేల 111 రూపాయలు, రన్నర్‌గా నిలిచిన జట్టుకు 3 లక్షల 55వేల 555 రూపాయలతో పాటు ట్రోఫీలను అందచేస్తామన్నారు. ఈ నెల 13న బాగారెడ్డి స్టేడియంలో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఆహ్వాన కమిటి సభ్యులు తహయాఫై జుబేర్, తులసీదాస్ గుప్తా, మైబు పాల్గొన్నారు.

## గౌడ జనహక్కుల పోరాట సమితి అధ్యక్షుడిగా ప్రవీణ్‌గౌడ్

**పాపన్నపేట, జనవరి 3, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన పాపన్నపేటలో శుక్రవారం మండల గౌడజన హక్కుల పోరాట కమిటీ నూతన కార్యవర్గాన్ని నియమించారు. గౌడజన హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షులుగా పాపన్నపేటకు చెందిన క్యాసగల్ల ప్రవీణ్‌గౌడ్, ఉపాధ్యాక్షులుగా కుర్తివాడ ప్రసాద్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మహేష్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లంపేటకు చెందిన మచ్చేందర్ గౌడ్, కార్యదర్శిగా సాయిఆబా గౌడ్, కోశాధికారిగా దున్నసాయి ప్రశాంత్ గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు మెలికట్టె విజయ్ కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి చంద్రం దుర్గాగౌడ్ తదితరులు పేర్కొన్నారు.

## ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు



పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

**న్యాల్‌కల్, జనవరి 3, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని మిర్జాపూర్(బి) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందిన ఫయాజుద్దీన్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మారుతి రాథోడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ



జడ్పీహెచ్‌ఎస్‌లో పిఆర్‌టియు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**సిర్గాపూర్, జనవరి 3, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన సిర్గాపూర్‌గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో శుక్రవారం పిఆర్‌టియు నూతనసంవత్సరం(2025) క్యాలెండర్‌ను మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిఆర్‌టియు మండల అధ్యక్షులు కర్ర నర్సింగ్‌చౌహాన్, ప్రధానకార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు బన్సీలాల్, ప్రభాకర్, ఎల్‌బినాయక్, దత్తు రాజు, మండలకార్యదర్శి లక్ష్మణ్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గెలుపుకు కృషి చేయాలి



మాజీమంత్రికి నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్‌నాయకులు

**జహీరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:**
రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో ప్రతిస్థానంలో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించేలా ఎవరికివారు తమవంతు కృషిచేయాలని మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మాజీమంత్రి క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రికి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు హ్యాపీ న్యూఇయర్ చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కండెం నర్సింలు, కోహీర్ మండలపార్టీ అధ్యక్షులు రామలింగారెడ్డి, యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నరేష్‌గౌడ్, ఐఎన్‌టియుసి అధ్యక్షులు రాజ్‌కుమార్, నాయకులు జయ రాజ్, చిన్న తదితరులు మాజీమంత్రికి హ్యాపీ న్యూ ఇయర్ చెప్పారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**పాపన్నపేట, జనవరి 3, ప్రభాతవార్త:** ఈనెల 4వతారీఖున మండల పరిధిలోని మిన్‌పూర్ 132కెవి సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయాగ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ నర్సింలు పేర్కొన్నారు. మిన్‌పూర్ 132కెవిలో మరమ్మతుల కారణంగా 33కెవి పొడ్చంపల్లి, కొత్తపల్లి, గంధర్పల్లి, నాగసాన్‌పల్లి, నార్సింగ్, ఆచనపల్లి, గాజులగూడెం, కొడుపాక, మిన్‌పూర్, కుర్తివాడ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 3 గంటలవరకు విద్యుత్ సరఫరా ఉండదని, అందుకు వినియోగదారులు విద్యుత్ అధికారులకు తమవంతు సహకరించాలని నర్సింలు వినతి చేశారు.

# సామాజిక విప్లవ జ్యోతి సావిత్రీబాయి పూలె



చిన్నశంకరంపేటలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో



మహిళా ఉపాధ్యాయులకు శాలువాలతో సన్మానం



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులు



మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం



నాగల్‌గిద్దలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు




ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎఫ్‌ఆర్‌ఓ సమీనా అఫ్రోజ్



శ్రీవిద్యపాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు

**చిన్నశంకరంపేటలో...**

**చిన్నశంకరంపేట, జనవరి 3, ప్రభాతవార్త:**
స్త్రీలవిద్య, అభివృద్ధికి కృషిచేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే అని ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి పోచయ్య అన్నారు. సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా శుక్రవారం చిన్నశంకరంపేటలోని జడ్పీ ఉన్నతపాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు.

**ప్రభుత్వ జూనియర్ కళాశాలలో...**

**చిన్నశంకరంపేట, జనవరి 3, ప్రభాతవార్త:**
సామాజిక విప్లవజ్యోతి సావిత్రిబాయి పూలే అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శశిధర్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మహిళా అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

**సావిత్రిబాయి పూలేకు నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి...**

**నారాయణఖేడ్ టౌన్, జనవరి 3, ప్రభాతవార్త:**
హైద్రాబాద్‌లోని భారతరాష్ట్రసమితి రాష్ట్రకార్యాలయం తెలంగాణ భవన్‌లో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నారాయణఖేడ్‌మాజీఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పూలమాలలువేసి నివాళులు అర్పించి సావిత్రిబాయి పూలే సమాజ ఉద్ధరణకు చేసిన త్యాగాలను, సేవలను కొనియాడారు.
కార్యక్రమంలో నియోజకవర్గ బిఆర్‌ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**పెద్దశంకరంపేటలో...**

**పెద్దశంకరంపేట, జనవరి3, ప్రభాతవార్త:**
భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జీవితం అందరికీ ఆదర్శప్రాయం అని మండల విద్యాధికారి వెంకటేశం అన్నారు. శుక్రవారం స్థానిక బాలికల ఉన్నతపాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి, మహిళా ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్ధిరాములు, సిబ్బంది సంపత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**మహిళల అభ్యున్నతికి మార్గదర్శి సావిత్రిబాయి పూలే: ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 3, ప్రభాతవార్త:**
శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.
కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్‌లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్. వెంకటేశ్వర్లు, మండలపార్టీ అధ్యక్షులు, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**వెల్దుర్తిలో...**

**వెల్దుర్తి, జనవరి 3, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన వెల్దుర్తిలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న 12 మంది మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ముఖ్యఅతిథిగా మండలవిద్యాధికారి యాదగిరి పాల్గొన్నారు.
కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సాంబయ్య, ఉపాధ్యాయినులు అర్చన, నవనీత, అమూల్య, సునీత, శైలజ, పద్మజ, వాణిశ్రీ, జయసుధ, రాధిక, ప్రశాంతిదేవి, రేణుకదేవి, రాధిక, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

**కారముంగిలో ఘనంగా...**

**నాగల్‌గిద్ద, జనవరి 3, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని కారముంగి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**నాగల్‌గిద్దలో...**

మండలకేంద్రమైన నాగల్‌గిద్దలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శంకర్, పిఆర్‌టిఓ ప్రధాన కార్యదర్శి నాగనాథ్, విజయేందర్‌రెడ్డి, బాబుశెట్టి తదితరులు పాల్గొన్నారు.

**జహీరాబాద్‌లో...**

**జహీరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:**
జహీరాబాద్ పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. రంజోల్ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన జయంతి వేడుకల్లో జహీరాబాద్ ఫారెస్ట్ రేంజ్ అధికారి సమీనీ ఆఫ్రోజ్ పాల్గొని మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి సావిత్రిబాయి సమాజనిర్మాణానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అదికారి కృష్ణమ్మ, ప్రిన్సిపాల్ సృజన, అధ్యాపకులు, ఉపాధ్యాయులు సూపరిండెంట్ మఠం గంగాధర్, స్వేరో జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

**పాపన్నపేట, శ్రీవిద్యపాఠశాలలో...**

**పాపన్నపేట, జనవరి 3, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన పాపన్నపేటలోని శ్రీవిద్యపాఠశాలలో సావిత్రిబాయిపూలే 194వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు టిఆర్‌ఎస్ పార్టీ అండ

**-ఎమ్మెల్యే సునీతారెడ్డి**




నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతుల కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

**నర్సాపూర్, జనవరి 3, ప్రభాతవార్త:**
నర్సాపూర్-హైదరాబాద్ జాతీయరహదారిపై నర్సాపూర్ అటవీప్రాంతంలో గల మేడాలమ్మ దేవాలయం వద్ద శుక్రవారం ఉదయం నర్సాపూర్ నుండి హైదరాబాద్ వెళ్తున్న కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న రెండు ఆటోలను ఢీకొట్టడంతో నలుగురు దుర్మరణం పాలయ్యారు. ఈమేరకు మృతులు నర్సాపూర్‌మండలంల రుస్తుంపేట గ్రామానికిచెందిన దూడి ఐశ్వర్య లక్ష్మి, సూరారంకుచెందిన పంచాయితీరాజ్ ఏఈ పాపగారి మనీషా, నర్సాపూర్ మండలం ఎల్లారెడ్డిగూడ తండాకుచెందిన మాలోత్ ప్రవీణ్, కౌదిపల్లికి చెందిన అనసూయ అక్కడికక్కడే నలుగురు మృతిచెందారు. ఈసందర్భంగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రిని సందర్శించి మృతుల కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ మృతులకుటుంబాలకు బిఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. మృతిచెందిన కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అన్నారు. ఈఘోర రోడ్డుప్రమాదంలో నలుగురు మృతిచెందడం చాలా బాధాకరమని అన్నారు. ఈకార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ నయీమోద్దీన్, బిఆర్‌ఎస్‌పార్టీ సీనియర్ నాయకులు సత్యంగౌడ్, సూరారం నర్సింలు, రింగుల ప్రసాద్, శివకుమార్, మండలపార్టీ అధ్యక్షుడు భోగ శేఖర్, జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సేనాధిపతి, రవికుమార్ నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఆదుకుంటుంది

**-జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్**



మృతుల కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మెదక్‌జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ తదితరులు

**నర్సాపూర్, జనవరి 3, ప్రభాతవార్త:**
నర్సాపూర్ హైదరాబాద్ జాతీయరహదారి నర్సాపూర్ అటవీప్రాంతంలో ఆటోలను కారు ఢీకొన్న సంఘటనలో నలుగురు మృతిచెందగా వారి కుటుంబాలను నర్సాపూర్ ఆసుపత్రిలో మెదక్‌జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ పరామర్శించారు. రుస్తుంపేట గ్రామానికిచెందిన దూడి ఐశ్వర్యలక్ష్మి, సూరారం ప్రాంతానికిచెందిన పిఆర్ ఏఈ పాపగారి మనీషా, ఎల్లారెడ్డిగూడ తండాకుచెందిన మాలోత్ ప్రవీణ్, కౌడిపల్లికిచెందిన అనసూయలు మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈసందర్భంగా ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ బాధిత కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు. కుటుంబసభ్యులకు మనోధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నర్సాపూర్ మాజీ ఎంపీపీ జ్యోతి సురేష్‌నాయక్, నర్సాపూర్‌బ్లాక్ అధ్యక్షులు రిజ్వాన్, మండలాధ్యక్షులు మల్లేష్, రుస్తుంపేట మాజీ ఎంపీటీసీ అశోక్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం

**జోగిపేట, జనవరి 3, ప్రభాతవార్త:**
జోగిపేట అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం అయ్యప్పస్వాములకు అన్నదానం నిర్వహించారు. జోగిపేట పట్టణానికిచెందిన కీర్తిశేషులు పులుగు కిష్టయ్య కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. హౌసింగ్‌బోర్డు కాలనీలోని అయ్యప్పస్వామి ఆలయంలో దీక్షచేపట్టిన స్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం అన్నదానం చేశారు. అనంతరం కొంతమంది స్వాములకు గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడివేసిన అనంతరం వారు శబరిమలై యాత్రకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పులుగు నర్సింహారావు, పులుగు గోపాల్‌రావు, పులుగు లక్ష్మీబాయి పాల్గొన్నారు.

## సర్వశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



సర్వశిక్ష ఉద్యోగుల సమ్మెలోపాల్గొన్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి లంటు చంద్రశేఖర్

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 3, ప్రభాతవార్త:**
తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సమగ్ర సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి లంటు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మెదక్ జిల్లాకేంద్రంలోని మెదక్ కలెక్టర్ కార్యాలయం ముందు సమ్మెచేస్తున్న సర్వశిక్ష ఉద్యోగులకు మద్దతుగా ఆయన దీక్ష నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి లంటు చంద్రశేఖర్ మాట్లాడుతూ సర్వశిక్ష ఉద్యోగుల న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని కోరారు. ఎన్నికల సందర్భంగా ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామని చేసిన వాగ్దానంమేరకు వెంటనే రెగ్యులర్ చేసేందుకుగాను తక్షణమే ప్రక్రియ ప్రారంభం చేయాలన్నారు. వీరి సమ్మెకి తెలంగాణ సోషల్ ఫోరం తరపున సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బిసి సంఘం రాష్ట్రనాయకులు పోలా విజయ్‌కుమార్, ఉద్యోగసంఘం జిల్లా అధ్యక్షులు రాజు, న్యాయవాది దొడ్ల శ్రీనివాస్‌రెడ్డి, రాము పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో ఇరువురి మృతి పట్ల విషాదఛాయలు



ఆసుపత్రి వద్ద కన్నీటి పర్యంతమవుతున్న రెండుగ్రామాల ప్రజలు

**నర్సాపూర్, జనవరి 3, ప్రభాతవార్త:**
నర్సాపూర్ హైదరాబాద్ జాతీయ రహదారిలో గల నర్సాపూర్ అటవీ ప్రాంతంలో రోడ్డుప్రమాదంలో నలుగురు మృతిచెందగా ఇద్దరూ నర్సాపూర్ మండలపరిధిలో రుస్తుంపేటగ్రామానికి చెందిన దూడి ఐశ్వర్యలక్ష్మి (20) నర్సాపూర్ మండలం ఎల్లారెడ్డిగూడ తండాకు చెందిన మాలోత్ ప్రవీణ్(30). రెండు ఆటోలను కారు ఢీకొన్న సంఘటనలో నర్సాపూర్ మండలానికి చెందిన ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. రుస్తుంపేట గ్రామానికిచెందిన ఐశ్వర్యలక్ష్మి షాపూర్‌నగర్‌లో డిగ్రీ చదువుతుండగా, కళాశాల బంద్ ఉండగా నర్సాపూర్‌కు వస్తున్నారు. అదేవిధంగా ఎల్లారెడ్డిగూడ తండాకుచెందిన మాలోత్ ప్రవీణ్ సూరారంలో తన అత్తగారింటికి వెళ్లి తిరిగి నర్సాపూర్ వస్తుండగా ఈ ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతిచెందారు. దీంతో ఈరెండు కుటుంబాల్లో తీవ్రవిషాదం నెలకొంది. రుస్తుంపేట గ్రామస్థులు, ఎల్లారెడ్డిగూడ తండావాసులు సైతం కన్నీటి పర్యంతమయ్యారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలె జయంతి వేడుకలు

**న్యాల్‌కల్, జనవరి 3, ప్రబాతవార్త:**
మండలకేంద్రమైన న్యాల్‌కల్‌లోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో శుక్రవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించి సావిత్రిబాయి పూలే సమాజోద్ధరణకు చేసినసేవలను కొనియాడారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను ఎన్‌హెచ్‌ఆర్‌ఎస్‌జెసి మండల అధ్యక్షులు నవీన్, మండల చైర్మన్ బి.సందీప్‌లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సచ్చితానందరెడ్డి, పాఠశాల చైర్మన్ మల్లేశ్వరి, ఉపాధ్యాయులు శశికళ, శ్రీనివాసమ్మ, జయంతి, సునీత, బుజ్జమ్మ, విజయలక్ష్మి, రేణుకారాణి, భవాని, జ్యోతి, మార్త, సునీతరాణి, ప్రవళిక, కిష్టయ్య, జైపాల్‌రెడ్డి, సిహెచ్ మొగులయ్య, యం మొగులయ్య, రాము, శాబోద్దిన్, శ్రీనివాస్, ధనరాజ్, పార్వతి, శివ, సాయి, అశోక్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

**జోగిపేట, జనవరి 3, ప్రభాతవార్త:**
సావిత్రిబాయి పూలేను స్ఫూర్తిగా తీసుకొని మహిళలు అన్నిరంగాల్లో ముందుకు రాణించాలని జోగిపేట ట్రాన్స్‌కో డిఇ శ్రీనివాసులు, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు ఆకుల మాణయ్య అన్నారు. శ్రీక్రిష్ణవేణి పాఠశాలలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ బ్యాక్‌వర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏడి శ్రీనివాస్, ఏవో నాగరాజు, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్దన్, ప్రధాన కార్యదర్శి సుఎందర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మదారి నాగరాజు, కోశాధికారి శోభారాణి, జెఏవో మాధవి, పాఠశాల ప్రిన్సిపల్ సలేహ తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్విజ్ పోటీ...**
సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులతో క్విజ్‌పోటీ నిర్వహించారు. అల్లాదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రథమస్థానం, ఎస్‌ఆర్‌ఎం జూనియర్ కళాశాల జోగిపేటకు ద్వితీయస్థానం, టేక్మాల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తృతీయస్థానం పొందారు. ఇందులో జోగిపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రజిత, జోగిపేట మున్సిపల్ కమిషనర్ తిరుపతి పాల్గొన్నారు.

**మైనార్టీ గురుకులంలో సావిత్రీబాయి జయంతి వేడుకలు**

**నారాయణఖేడ్, జనవరి 3, ప్రభాతవార్త:**
సావిత్రీబాయి పూలే అడుగుజాడల్లో నడిచి మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని సావిత్రిబాయిపూలే ప్రతిమహిళకు విద్యను అందించాలనే లక్ష్యంతో పోరాటంచేసి విజయం సాధించిందని నారాయణఖేడ్ మైనార్టీ గురుకులపాఠశాల ప్రిన్సిపాల్ ఖాదర్ అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోగల మైనార్టీ గురుకుల బాలుర ఉన్నత పాఠశాల కళాశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో సావిత్రీబాయి చిత్రపటానికి ప్రిన్సిపాల్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పూలమాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులకు పూలమాల శాలువతో ఘనంగాసన్మానించారు. కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ రాములు, సంజీవనాయక్, వార్డెన్ ఇబ్రహీం, జకీర్, నాహేద ఉన్నిసా, అస్రా సుల్తాన, పద్మ, నవనీత, భారతి, ఇఫ్రత్ నిశిత, పిఈటీ అజీజ్, పిడి సంతోష్, కళాశాలసిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి: పిఆర్‌టియుటిఎస్ మండల అధ్యక్షుడు**

**నర్సాపూర్, జనవరి 3, ప్రభాతవార్త:**
సావిత్రీబాయి స్ఫూర్తితో మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని పిఆర్‌టియుటిఎస్ నరసాపూర్ మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం నర్సాపూర్‌పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాలలో సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా నర్సాపూర్ పిఆర్‌టియు టిఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంతేగాక మహిళా దినోత్సవం సందర్భంగా మండలపరిధిలోని అన్నిపాఠశాలల మహిళా ఉపాధ్యాయినులను శాలువాలతో సన్మానించారు. ఈమేరకు మహిళలందరూ సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని అన్నిరంగాల్లో ముందుకు సాగాలని పిఆర్‌టియుటిఎస్ మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు జ్యోతి, పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్, మండల ప్రధానకార్యదర్శి, భీమ్లా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, దొంతి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రీబాయి పూలె జయంతి వేడుకలు



టేక్మాల్‌లో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు



జయంతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్



వేడుకలు జరుపుకుంటున్న బిజెపి నాయకులు



కిష్టాపూర్ పాఠశాలలో సావిత్రీబాయి జయంతి వేడుకలు

**టేక్మాల్, జనవరి 3, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని ఆయాగ్రామాల్లోనసావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆదర్శ యువజన సంఘం అధ్యక్షులు శేషు మాట్లాడుతూ తొలిమహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే గొప్ప సంఘసంస్కర్త, కవి, రచయిత్రి, మహిళాసమాజం కోసం అహర్నిశలు కృషి చేసినటువంటి మాతృమూర్తి సావిత్రిబాయి పూలే అన్నారు. ఈరోజు మహిళలందరం విద్య, వైద్యం రాజకీయరంగంలో ఉన్నామంటే దానికి కారణం సావిత్రిబాయి పూలే అని, భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని అన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రావణ్, సభ్యులు నాగరత్నం, శివ, పవన్, అనుక్, రాజేష్ దుర్గేష్, కృష తదితరులు పాల్గొన్నారు.

**సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్...**

**పటాన్‌చెరు, జనవరి 3, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు ప్రభుత్వపాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలో ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ హాజరయ్యారు. ఆమహామూర్తి జయంతి సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిఎస్ హెడ్‌మాస్టర్ రవీంద్ర, హైస్కూల్ ఇంచార్జ్ సీతామహాలక్ష్మి, ఉపాధ్యాయులు రఘుపతి, మోహన్, ధనరాజ్, రూప్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

**సాయినగర్ కాలనీలో...**

**రామచంద్రాపురం, జనవరి 3, ప్రభాతవార్త:**
రామచంద్రాపురంలోని సాయినగర్ కాలనీలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతివేడుకలను భారతీయ జనతా పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ కృష్ణమూర్తి సంతోష్, సాయినగర్‌కాలనీ మాజీ అధ్యక్షులు పెంటరెడ్డి, రాంబాబు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

**కిష్టాపూర్ పాఠశాలలో...**

**కొల్చారం, జనవరి 3, ప్రభాతవార్త:**
స్త్రీల విముక్తికోసం అహర్నిశలు కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని మండల విద్యాధికారి సత్యనారాయణరావు, కిష్టాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యశోద, మాజీసర్పంచ్ తిరునగారి గోదావరిలు అన్నారు. శుక్రవారం కొల్చారం మండలపరిధిలోని కిష్టపూర్ ప్రాథమిక, ఉన్నతపాఠశాలల్లో సావిత్రిబాయి పూలే 193వ జయంతివేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు తదితరులు పాల్గొన్నారు.

**మెదక్ పట్టణంలో...**

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 3, ప్రభాతవార్త:**
మెదక్‌పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతివేడుకలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన మహిళా ఉపాధ్యాయ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా సోషల్‌వెల్ఫేర్ అధికారిణి విజయలక్ష్మి మాట్లాడుతూ నేడు



సదస్సులో జిల్లా సోషల్‌వెల్ఫేర్ అధికారిణి విజయలక్ష్మి

మహిళలు అన్నిరంగాలలో ఎన్నిసమస్యలు ఉన్నాకూడా వృత్తినిర్వహణలో విజయవంతంగా ముందుకుసాగుతున్న ఉదాహరణలు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సింహారెడ్డి, గణపతి, డా.ప్రవీణ్‌కుమార్, డా.శరత్ రెడ్డి, డా.శ్రీలత, హరిత, నిదర్శిని, డా.అరుంధతి, సంధ్యశ్రీ, నాగరాణి, దీప్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరి ఆలయంలో సామూహిక కుంకుమార్చన



ఆలయంలో సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్న దృశ్యం

**టేక్మాల్, జనవరి 3, ప్రభాతవార్త:**
టేక్మాల్‌గ్రామంలోని శ్రీరాజరాజేశ్వరి ఆలయ 55వ వార్షికోత్సవ సందర్భంగా ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, నవావరణ హోమం, మహాపూజ, లక్షకుంకుమార్చన, అనంతరం శ్రీ పార్వతీరాజరాజేశ్వర కళ్యాణం నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

## మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించిన దృశ్యం

**పటాన్‌చెరు, జనవరి 3, ప్రభాతవార్త:**
మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం బొల్లారం మున్సిపల్ పరిధిలోని శ్రీవాగ్దేవి విద్యాసంస్థల కరస్పాండెంట్ అంబటిరం ఉదయభాస్కర్‌రెడ్డి పాఠశాల మహిళా ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల మహిళా ఉపాధ్యాయులను శాలువాలు కప్పి సన్మానం చేసి మహిళా ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా శ్రీవాగ్దేవి విద్యాసంస్థల కరస్పాండెంట్ అంబటిరం ఉదయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా జనవరి 3న రాష్ట్రవ్యాప్తంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా టీచర్స్‌డేగా నిర్వహించనున్నట్లు పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసిందని. సావిత్రిబాయి పూలే జయంతిని మనం జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మాజీమంత్రి హరీష్‌రావు

**రామచంద్రాపురం, జనవరి 3, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు సర్కిల్ క్యాలెండర్‌ను శుక్రవారం మాజీ మంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్వీ విద్యార్థి విభాగం సర్కిల్ అధ్యక్షులు క్రాంతి వాలేటి, బిఆర్ఎస్ లీగల్ సెల్ బాధ్యులు కళ్యాణ్‌రావు, వేణు గోపాల్, భాస్కర్‌గౌడ్, రాము, గౌతమ్, వేణు, సదానందం, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీమంత్రికి మాజీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు



మాజీమంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీఎమ్మెల్యే

**నారాయణఖేడ్ టౌన్, జనవరి 3, ప్రభాతవార్త:**
మాజీమంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుకు నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి శుక్రవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు నర్సింలు యాదవ్, మాజీ సర్పంచ్ రాజు, నాయకులు గోపాల్ యాదవ్, మహేష్ యాదవ్, సంగారెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

## ఐఐఐడి వేడుకల్లో ప్రతిభచాటిన గీతం విద్యార్థులు



ఐఐఐడి వేడుకల్లో మొదటిబహుమతి కైవసంచేసుకున్న గీతం విద్యార్థులు

**పటాన్‌చెరు, జనవరి 3, ప్రభాతవార్త:**
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియల్ డిజైనర్స్ (ఐఐఐడీ) హైదరాబాద్ ప్రాంతీయకేంద్రం వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విద్యార్థులు తమ అసాధారణ ప్రతిభను, సృజనాత్మకతను సగర్వంగా ప్రదర్శించి పలువురి మన్ననలను అందుకున్నారు. ప్రఖ్యాత డిజైనర్ గీత బాలకృష్ణన్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పలువురు నిపుణులు ఉత్సాహంగా పాల్గొని, హైదరాబాద్‌లోని డిజైన్ కమ్యూనిటీ ఐక్యతను చాటిచెప్పారు.

గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ బందన్‌కుమార్‌మిశ్రా, అధ్యాపకులు అభిషేక్‌కుమార్‌సింగ్, స్నిగ్ధారాయ్‌లతోపాటు విద్యార్థులు అనుశ్రీ కలకుంట్ల, భవ్యరెడ్డి, సూర్యకుమారి తదితరులు ప్రాతినిధ్యం వహించారు. ప్రాథమిక దశలోనే అత్యంతప్రతిభ కనబరిచిన భవ్యరెడ్డి, స్నిగ్ధారాయ్ బృందం, ప్రతిష్ఠాత్మక తుదిపోటీకిచేరుకుని మొదటిబహుమతిని కైవసం చేసుకు న్నారు. విజేతలుగా ట్రోఫీతోపాటు పదివేలరూపాయల నగదు పురస్కా రాన్ని అందుకున్నారు. ఇందులో పాల్గొన్నవారందరూ ప్రదర్శించిన అంకిత భావం, సృజనాత్మకత, ఆవిష్కరణలు, ఇంటీరియర్ డిజైన్‌లో స్నేహం, శ్రేష్ఠత స్ఫూర్తిని పెంపొందించాయి. ఈ కార్యక్రమం గీతం, విస్తృత డిజైన్ కమ్యూనిటీ మధ్య సంబంధాన్ని మరింత బలోపేతం చేయడమే గాక, ఇంటీరియర్ డిజైన్ విద్యలో సృజనాత్మకత, శ్రేష్ఠతను పెంపొందించడంలో విశ్వవిద్యాలయ తిరుగులేని నిబద్ధతను చాటి చెబుతోంది.

## సర్వేకు అందుబాటులో ఉండాలి

**-ఎంపిడిఓ రాజశేఖర్**

**న్యాల్‌కల్, జనవరి 3, ప్రభాతవార్త:**
ఇందిరమ్మ ఇళ్ల కొరకు ధరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లను సర్వే చేయని వారు శనివారం ఇళ్ల వద్ద అధికారులకు అందుబాటులో ఉండి సర్వే చేయించుకోవాలని మండల అభివృద్ధి అధికారి కవలాస్ రాజశేఖర్ మండల ప్రజలకు సూచించారు. సర్వేలో మిగిలిపోయిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజశేఖర్ సూచించారు.

## కలెక్టర్‌కు ఎమ్మెల్యే న్యూ ఇయర్ శుభాకాంక్షలు



కలెక్టర్ వల్లూరు క్రాంతికి కలుసుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్ టౌన్, జనవరి 3, ప్రభాతవార్త:**
జిల్లాకలెక్టర్ వల్లూరు క్రాంతిని శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ పూలబొకేని అందచేశారు. నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధికి చేయూత అందచేయాలని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు.

## రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**-బిఆర్ఎస్ రాష్ట్రనాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి**

**గుమ్మడిదల, డిసెంబరు 3, ప్రభాతవార్త:**
రైతులను మోసంచేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మరో కుట్ర చేస్తుందని, ఎలాంటి షరతులులేకుండా రెండువిడతల రైతుభరోసాను అందజేయాలని బిఆర్ఎస్ రాష్ట్రనాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి డిమాండ్‌చేశారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్‌ప్రభుత్వం పంటవేసిన రైతులకు మాత్రమే రెండోవిడత రైతు భరోసాను అందజేస్తామని ప్రకటించడం పట్ల బిఆర్ఎస్ రాష్ట్రనాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి స్పందించారు. ఈసందర్భంగా శుక్రవారం గుమ్మడిదల మండలకేంద్రంలో గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సంవత్సర కాలంలో ఇప్పటి వరకు రైతులకు ఎలాంటిపథకాలను అందచేయని కాంగ్రెస్‌ప్రభుత్వం నేడు రైతులకు కేవలం పంటవేసిన వారికే రైతుభరోసాను అందజేస్తామని ప్రకటించడం బాధాకరమని అన్నారు. కొన్ని రకాల రేగడు భూముల్లో మొక్కజొన్న, శనగ, పత్తి, కూరగాయలు ఇలా అనేకరకాల పంటలు పండుతాయన్నారు. కేవలం వరివేసిన పంటలకు మాత్రమే రెండువిడతల రైతుభరోసాని అందజేస్తామని తెలపడం, మిగిలినపంటలకు కేవలం ఒకవిడత రైతుభరోసా మాత్రమే అందజేస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో రైతులే రాజులని, వారికి రైతుభరోసాని అందజేస్తామన్న కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకిరాగానే ఇలాంటిషరతులు విధించి రైతులను నష్టపరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా రైతులకు ఇచ్చినహామీలను పూర్తిస్థాయిలో ఎలాంటి షరతులులేకుండా అమలు చేయాలని, రానున్నరోజుల్లో కాంగ్రెస్‌ప్రభుత్వానికి భారీగుణపాఠం తప్పదని, రైతులపక్షాన బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు.

## గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

**చిన్నశంకరంపేట, జనవరి 3, ప్రభాతవార్త:**
గ్రామంలో నెలకోన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని గజగట్లపల్లిగ్రామ ప్రత్యేక అధికారి లక్ష్మీప్రవీణ్ తెలిపారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామసభను నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. 2025-26 సంవత్సరానికి గాను గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులపై గ్రామస్థులతో చర్చించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తయిందని, గ్రామంలో సర్వేచేసే సమయంలో అందుబాటులో లేనివారి వివరాలను శనివారంలోగా పంచాయతీ కార్యదర్శి సంతోష్ వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్, ఆశావర్కర్ రాజమణి, సిఎ శేఖర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయండి

**-జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ సింధూ వినతి**



జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, జనవరి 3, ప్రభాతవార్త:**
భారతీనగర్ డివిజన్‌పరిధిలో పలు అభివృద్ధిపనులు నిర్వహించేందుకు నిధులు మంజూరుచేయాలని శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో కమిషనర్ ఉపేందర్‌రెడ్డికి శుక్రవారం కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి వినతి పత్రం అందచేశారు. ఈసందర్భంగా కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ బొంబాయికాలనీలో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో ప్రహరీగోడ నిర్మాణానికి, మ్యాక్‌సొసైటీ, బిడిఎల్ కాలనీలో కాంపౌండ్‌వాల్‌కు, ఎల్ఐజికాలనీ కమ్యూనిటీ రోడ్డులో వాటర్‌డ్రెయిన్ పనులకు నిధులు విడుదలచేయాలని కమిషనర్‌కు వినతిపత్రం అందచేశామన్నారు. నిధుల మంజూరుకు కమిషనర్ ఉపేందర్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి తెలిపారు. ఎంఐజి కాలనీలో పారిశుధ్య సిబ్బందితో మెయిన్‌రోడ్డుతో పాటు ప్రతివీధిలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను, సిబ్బందిని కార్పొరేటర్ ఆదేశించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు డిప్యూటీ కమిషనర్ సురేష్, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ శంకర్ తదితరులు ఉన్నారు.

## సిద్ధివినాయకుడిని దర్శించుకున్న మాజీమంత్రి



సిద్ధివినాయకుడిని దర్శించుకుంటున్న మాజీమంత్రి చంద్రశేఖర్

**న్యాల్‌కల్, జనవరి 3, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని రేజింతల్ గ్రామశివారులోని శ్రీసిద్ధివినాయక ఆలయంలో కొనసాగుతున్న 225వ జయంతి ఉత్సవాల్లో శుక్రవారం మాజీమంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మాజీమంత్రిని ఆలయమర్యాదలతో స్వాగతం పలుకగా ఆలయంలో అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా చంద్రశేఖర్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయకమిటీ బాధ్యులు మాజీమంత్రిని శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో న్యాల్‌కల్, ఝురాసంగం, జహీరాబాద్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, హన్మంతరావు పాటిల్, రామలింగారెడ్డి, జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు కండెం నర్సింలు, ఎంఎసి వైస్ చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి, న్యాల్‌కల్ సొసైటీ చైర్మన్ సిద్దలింగయ్యస్వామి, యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నరేష్‌గౌడ్, ఐఎన్‌టియుసి అధ్యక్షులు రాజ్‌కుమార్, మాజీ జడ్పీటిసి సభ్యులు బ్యాత చంద్రప్ప, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు జీవన్‌రెడ్డి, నాయకులు సంజీవరెడ్డి, ప్రేమ్ రాథోడ్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైద్య చికిత్సల్లో కోసం నిరుపేదలకు భరోసా

**-టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి**

**వెల్దుర్తి, జనవరి 3 ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం వైద్య చికిత్సల కోసం నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ నిధులతో భరోసా కల్పిస్తుందని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి, టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన మాసాయిపేటలో 10 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారి చేతుల మీదుగా అందజేశారు. మాసాయిపేట గ్రామానికి చెందిన కుమ్మరి శంకర్‌కు రూ. 60 వేలు. లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన భూషణ్ రెడ్డికి రూ. 34 వేలు, కొప్పులపల్లి గ్రామానికి చెందిన భిక్షపతికి రూ. 60 వేలు, నర్సింలుకు రూ. 21 వేలు, నారాయణ రెడ్డికి రూ. 60 వేలు, రామాంతాపూర్ గ్రామానికి చెందిన చౌహాన్ కమలకు రూ. 20 వేలు, కళ్యాణ్ కుమార్‌కు రూ. 60 వేలు, అచ్చంపేట గ్రామానికి చెందిన వినయ్‌కు రూ. 45 వేల విలువ చేసే చెక్కులను ఆవుల రాజిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు తక్షణ సాయం అందించడానికి అత్యవసర ఆరోగ్య సమస్యలకు చికిత్స కోసం ప్రజలకు నిధులు మంజూరు చేస్తుందని అన్నారు. పేద ప్రజల సేవకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకు ప్రతి నిరుపేదకు వైద్య సేవల కోసం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించడం జరుగుతుందన్నారు. వీటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాసాయిపేట ఎంపీటీసీ కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, నాగరాజు, జగదీష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

**మనూర్, జనవరి 3, ప్రభాతవార్త:**



మహిళా ఉపాధ్యాయిని అనూషను సన్మానిస్తున్న దృశ్యం

మండలపరిధిలోని బోరంచ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయిని యం అనూషను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం మహేష్ కుమార్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి, ఉపాధ్యాయులు సిహెచ్ నర్సప్ప, సిహెచ్ విజయకుమార్, టీ సాయిబాబా, కే రవికుమార్, ఏ నర్సిములు, వై నర్సింలు, ఎం అనూష, ఏ జగదీశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

**చిన్నశంకరంపేట, జనవరి 3, ప్రభాతవార్త:**
ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పిఆర్టీయు కృషి చేస్తుందని పిఆర్టీయు మండల అధ్యక్షుడు హరీష్‌బాబు తెలిపారు. శుక్రవారం చిన్నశంకరంపేట పట్టణంలో మండల విద్యాధికారి పుష్పవేణి పిఆర్టీయు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దీప్లా నాయక్, రవీందర్‌రెడ్డి, నరేష్‌కుమార్, రవి, చారి, శివకుమార్, ప్రేమ్‌కుమార్, రాజేశ్వర్, చౌదరి లింగయ్య, అశోక్, శ్రీధర్, శ్రీకాంత్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

**పుల్‌కల్, జనవరి 3, ప్రభాతవార్త:**
విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతిచెందిన సంఘటన మండలపరిధిలోని ముద్దాయిపేటగ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికిచెందిన మహమ్మద్ యాదుల్ తనకుగల కాడెద్ల సహకారంతో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని సాకుతున్నాడు. నిత్యంలాగే శుక్రవారం కాడెద్లను వ్యవసాయపొలానికి తీసుకుపోయి మేతమేసేందుకు తన వ్యవసాయ భూమివద్ద వదిలేశాడు. ఎద్దు మేతమేస్తూ అటుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకడంతో కరెంట్‌షాక్ తగిలి ఎద్దు అక్కడికక్కడే మృత్యువాత పడిందని మహమ్మద్ యాదుల్ కన్నీరు పెట్టుకున్నాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే (విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేకపోవడం) 80వేల రూపాయల విలువగల తన ఎద్దు మృతిచెందిందని రైతు వాపోయాడు. విద్యుత్ అధికారులు స్పందించి రైతు మహమ్మద్ యాదుల్‌కు నష్టపరిహారం చెల్లించాలని గ్రామ రైతులు, బాధిత రైతు కుటుంబసభ్యులు వినతి చేస్తున్నారు.



కరెంట్ షాక్‌తో మృతిచెందిన ఎద్దు

# సిసిరోడ్డు వేయాలని కార్పొరేటర్‌కు వినతి



బస్తీదర్శన్‌లో కార్పొరేటర్ పుష్పనగేష్‌కు వినతిపత్రం అందచేస్తున్న కాలనీవాసులు

**రామచంద్రాపురం, జనవరి 3, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్ కాలనీలో శుక్రవారం బస్తీదర్శన్ కార్యక్రమం నిర్వహించారు. జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ ఏఈ ఫైజెన్‌తో కలిసి కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ కాలనీలో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకు కాలనీ అధ్యక్షులు అమృత్‌సాగర్‌తో కలిసి కాలనీలో పర్యటించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్య త్వరలోనే పూర్తికానున్న సందర్భంగా నూతనంగా వేయనున్న డ్రైనేజి పైప్‌లైన్ వద్ద సిసి రోడ్డు వేయించాలని కాలనీవాసులు కోరగా నిధుల మంజూరు కొరకు ప్రతిపాదనలు పంపాలని ఏఈకి సూచించామన్నారు. సొసైటీ కార్యాలయం ప్రాంగణంలోని ఖాళీస్థలంలో థీమ్‌పార్క్ నిర్మించడానికి ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరు చేయించుకుని థీమ్‌పార్క్ పనులు ప్రారంభిస్తామన్నారు.

**అభివృద్ధిపనులపై సమీక్షించిన కార్పొరేటర్ పుష్ప..**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్ కాలనీ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం అభివృద్ధిపనులపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ కాలనీలో వీధిదీపాలు కరువయ్యాయని, రోడ్లన్నీ చీకటిమయం అయినట్లు, రోడ్డు నంబర్ 4లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజిసమస్య, సిసి రోడ్డుసమస్య, విద్యుత్‌తీగలు కిందకు వేలాడుతున్నాయని కార్పొరేటర్ అధికారులదృష్టికి తీసుకొచ్చి, అవి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్‌విభాగం అధికారులను కార్పొరేటర్ పుష్పనగేష్ ఆదేశించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కార్పొరేటర్‌కు వినతిపత్రం అందచేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏఈ ఫైజాన్, నాయకులు, కాలనీ బాధ్యులు సిఎం మల్లేష్, నరేంద్రబాబు, సంజీవ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, రాములు, మునిస్వర్, సలామ్, రావు రమేష్, బసవరాజ్, వెంకట్‌రావు, ఎమ్ఎస్‌రెడ్డి, సత్యం, రమేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.